క్లుప్తంగా

అర్హులందరికీ రేషన్ కార్డులు



లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న వేణుగోపాలరావు

మెరకముడిదాం: అర్హులందరికీ ప్రభుత్వం పారదర్శకంగా రేషన్‌కార్డులు మంజూరు చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడ్డి వేణుగోపాలరావు తెలిపారు. మండలంలోని గర్భాం గ్రామానికి మంజూరైన 27 కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి ఆర్థిక సహాయం



నగదు అందజేస్తున్న సంజయ్‌కుమార్ ధనూకా

చీపురుపల్లి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి పలువురు దాతలు నుంచి ఆర్థిక సహకారం లభిస్తోందని లయన్స్‌క్లబ్ ప్రతినిధి ఎస్.సన్యాసిరావు తెలిపారు. పట్టణంలోని మెయిన్‌రోడ్‌కు చెందిన వ్యాపారి సంజయ్‌కుమార్ ధనూకా రూ.5,100, ఆంజనేయపురంనకు చెందిన గరిమెల్ల విజయసారథి(నానిబాబు) రూ.5 వేల సహాయం మంగళవారం అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు కె.వి.ఎస్.సత్యానారాయణ, డి.సీతారామరాజు, దిలీప్‌కుమార్ ధనూకా తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ



రికార్డులను పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీనివాసరావు

మెరకముడిదాం: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన రికార్డులన్నీ పక్కాగా నిర్వహించాలని ఆ పథకం ఏపీడీ ఎం.శ్రీనివాసరావు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సిద్ధం చేస్తున్న రికార్డులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ఖర్చుచేసిన ప్రతీ రూపాయికి సంబంధించిన వివరాలను రికార్డుల్లో పొందుపరచాలని చెప్పారు. ఏపీఓ ఎస్.పెద అప్పలనాయుడు ఆయన వెంట ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వేపాడ హైస్కూల్‌లో వంట సరుకులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కర్

వేపాడ: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు ఎంఈఓ-2 బాలభాస్కర్ సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన తనిఖీలు చేశారు. రికార్డులు, విద్యార్థుల వర్క్‌బుక్స్, మధ్యాహ్న భోజన వంట సరుకులను పరిశీలించారు. వంట చేసే పరిసరాలు శుభ్రంగా ఉండాలని, వంటకాలను రుచికరంగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ వల్లీ, ఉపాధ్యాయులు ఉన్నారు. అలాగే దొగ్గపేట ప్రాథమిక పాఠశాలను నీలకంఠరాజుపురం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వెంకటరమణ సందర్శించారు.

పెట్రోల్ బంక్‌లో తనిఖీలు



పెట్రోల్ బంక్‌లో సదుపాయాలను పరిశీలిస్తున్న అధికారులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి పెట్రోల్ బంక్‌లో తహసీల్దార్ గురుమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ మంగళవారం తనిఖీలు నిర్వ హించారు. రికార్డులను, చమురు నిల్వలు, తూనికల పరికరాలన పరిశీలించారు. ఉచిత గాలి పంప్, మరుగుదొడ్ల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్, చల్లపేటరూరల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గజపతినగరం సబ్‌స్టేషన్, చల్లపేటరూరల్ ఫీడర్ పరిధి గజపతినగరం, మెంటాడ మండలాల్లోని గ్రామాలకు గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



వేపాడ: గుడివాడలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



జామి: టి.కొత్తూరులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

వేపాడ: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. జాకేరు సచివాలయం పరిధి గుడివాడ గ్రామంలో మంగళ వారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల ద్వారా ప్రతీ కుటుంబా నికి కలిగిన లబ్ధిని వివరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. రైతులకు గ్రామాల్లో నే సకాలంలో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నామని, సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ఊళ్లలోనే అందిస్తున్నామని వివరించారు. స్థానిక సర్పంచ్ మిడతాన గోపి, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, ఉత్తరాంధ్ర పంచాయతీరాజ్ కన్వీనర్ మెరపల సత్యనారాయణ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పద్మావతి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, వివిధ గ్రామాల సర్పంచులు మురిపిండి గంగరాజు, రాము నాయుడు, సతీష్, వేమన రాము, ఎంపీటీసీలు టి.విరమణ, ఏ.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, నాయకులు ముత్యాలునాయుడు, సింహాచలం నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల ఆనందమే ధ్యేయం : ఎమ్మెల్యే అప్పలనరసయ్య

జామి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల ఆనందమే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని టి.కొత్తూరు గ్రామంలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక, మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాలను వివరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2014లో చంద్రబాబు నాయుడు వందల హామీలు ఇచ్చి , మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని, ఆ తర్వాత ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసగించారని గుర్తు చేశారు. మళ్లీ ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో మాయమాటలు చెబుతున్నారని, టీడీపీ నాయకుల మాటలను నమ్మవద్దని హితువు పలికారు.ఎంపీడీఓ ఎం.సతీష్, తహసీల్దార్ జి.హేమంత్ కుమార్, స్థానిక సర్పంచ్ కరక వందన, ఎంపీటీసీ కృష్ణవేణి, ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, ఏఎంసీ చైర్మన్ వేముల ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచారక్ గుడివాడ రాజేశ్వరరావు, స్థానిక నాయకులు కరక దశరథ, ఫణిబాబు, గేదెల రమణబాబు, పలుగ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల చెంతకే సేవలు



జామి: సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

జామి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవల ప్రజలకు చేరువయ్యాయని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని అట్టాడ గ్రామంలో సచివాలయ నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ సతీష్, తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, పీఆర్ డీఈ స్వామినాయుడు, జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, స్థానిక సర్పంచ్ పోతల అమ్మన్నదొర, ఎంపీటీసీ పి.లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, ఏఎంసీ చైర్మన్ వేముల ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచారక్ గుడివాడ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి, ఎం.గుమడాం గ్రామాల్లోని సచివాలయ నూతన భవనాలను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య బుధవారం ప్రారంభించనున్నారని ఎంపీడీఓ కిశోర్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండల అధికారులు, స్థానిక సచివాలయాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పశువులకు 'లంపి' నివారణ టీకాలు

గంట్యాడ: పశువులకు లంపి చర్మ వ్యాధి సోకకుండా ముందుజాగ్రత్తగా టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ రెడ్డి కృష్ణ పాడిరైతులకు సూచించారు. మండలంలోని నరవ గ్రామంలో ఏర్పాటు చేసిన లంపి చర్మ వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. 308 పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులంతా పశుగ్రాసాలు పెంచాలని సూచించారు. లేగ దూడల పెంపకంలో మెలకువలను వివరించారు. మండల పశు వైద్యాధికారి బి.సత్యనారాయణ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ బి.శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శృంగవరపుకోట: న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక భద్రతా చట్టం చేయకుంటే న్యాయవాద వృత్తి అంతరించుకుపోతుందని ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లు సత్యాజీ, డబ్ల్యూ.ఎస్.శర్మ అన్నారు. విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆర్.ఆదిశేషు విఠల్‌బాబు హత్యపై ఎస్.కోట కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై తిరగబడే సమాజం ఏర్పడడం సరికాదని అన్నారు. న్యాయవాదులు బి.త్రిమూర్తులు, వారాది ఈశ్వరరావు, బి.వి.ఎస్.రామారావు, బి.సత్యనారాయణ, బి.శేఖర్, జి.చిట్టిబాబు, పి.రామకృష్ణ, బి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'



పీడీలతో సమావేశమైన ఎంపీడీఓ శేషుబాబు

శృంగవరపుకోట: పదిహేడేళ్లు దాటిన యువతకు 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2 నుంచి ఆటల పోటీలు నిర్వహించాలని ఎంపీడీఓ శేషుబాబు వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ నర్సింగరావు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 సచివాలయాల పరిధిలో 17 ఏళ్లు దాటిన యువతీ,యువకులకు కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు వేర్వేరుగా నిర్వహించాలని నిర్ణయించారు. ముందు సచివాలయాల మధ్య పోటీలు నిర్వహించి సచివాలయాల పరిధి విజేతలకు మండలస్థాయి పోటీలో అవకాశం కల్పిస్తామని చెప్పారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి ఎస్.కోట, ధర్మవరం, వీరనారాయణం ఉన్నత పాఠశాలలు, తాటిపూడి బాలికల గురుకుల పాఠశాల వేదికగా ఈపోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఒక సచివాలయం పరిధిలో ఎన్ని జట్లు అయినా పాల్గొనవచ్చని తెలిపారు.

గజపతినగరంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్యశిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరంలో 86 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఆరోగ్య కార్యకర్త మంగమ్మ ,ఆశ కార్యకర్తలు కనకరత్నం,ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

40 ఏళ్లకే పింఛన్ ఇప్పించండి

వేపాడ: కళాకారులకు 40 ఏళ్లకే పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని బహుజన కళా మండలి రాష్ట్ర కార్యదర్శి ఆతవ ఉదయ్ భాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కళాకారులకు ఇస్తున్న ప్రస్తుత పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కళాకారుల సమస్యలు, ఇతర అంశాలపై బీమవరంలో త్వరలో సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు.

అధిక వినియోగంతో అనర్థం

గజపతినగరం రూరల్: పంటలకు అవసరానికి మించి ఎరువులు వేయడం వల్ల ఖర్చుతో పాటు అనేక అనర్థాలు ఉన్నా యని ఏఓ ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని తుమ్మికాపల్లి, కెంగువ గ్రామాల్లో మంగళవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నారుమడి ఆరోగ్యంగా ఉండాలంటే కార్బోఫ్యూరాన్ గుళికలు వినియోగిస్తే సరిపోతుందన్నారు. వరినాట్లు వేసిన తర్వాత చేను త్వరగా ఏపుగా పెరగాలనే ఉద్దేశంతో చాలామంది రైతులు అధికంగా ఎరువులు వినియోగిస్తుంటారని, ఈ విధానం సరికాదన్నారు. ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అదనపు వ్యవసాయాధికారి గోవిందమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

92 శాతం పింఛన్ల పంపిణీ



విజయనగరం ఆస్పత్రికి వెళ్లి వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ సునీత

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా ఆగస్టుకు సంబంధించిన సామాజిక పింఛన్ల పంపిణీ 17 గ్రామ సచివాలయాల పరిధిలో తొలి రోజు మంగళవారం 92 శాతం పూర్తయిందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.గ్రామ వలంటీర్లు ఉదయం నుంచే ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛను నగదు అందజేశారు. మరడాం గ్రామానికి చెందిన అదపాక పోలయ్య ఇటీవల పొలం పనులు చేస్తుండగా పాముకాటు వేయడంతో విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. వలంటీర్ సునీత ఆస్పత్రికి వెళ్లి పోలయ్యకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

గంట్యాడ: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా స్వర్ణకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ప్రసన్నరాఘవ స్వచ్ఛంద ఉద్యోగవిరమణ చేయడంతో ఉన్నతాధికారులు స్వర్ణకుమార్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు.

కామ్రేడ్ అప్పలనాయుడికి నివాళి



ఆల్తి సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

గజపతినగరం: మండల కేంద్రానికి చెందిన కామ్రేడ్ ఆల్తి అప్పలనాయుడు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ తదితరులు అప్పలనాయుడు సమాధిపై పూలుజల్లి నివాళి అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అప్పలనాయుడు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడేవారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని చెప్పారు. సీపీఐ నాయకులు మహదేవ్ శ్రీనివాసరావు,గేదెల రామునాయుడు, ఆల్తి వరలక్ష్మి, రాజేశ్వరి,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

- బీఎల్‌ఓలకు ఆర్డీఓ సూర్యకళ ఆదేశం



గజపతినగరం: గజపతినగరంలో చేపడుతున్న ఇంటింట ఓటర్ల సర్వేలో ఆర్డీఓ సూర్యకళ



శృంగవరపుకోట: మాట్లాడుతున్న ఈఆర్ఓ సుదర్శన్‌దొర



కొత్తవలస: బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్

గజపతినగరం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు(బూత్ లెవెల్ అధికారులు) ఓటర్ల జాబితాపై ఇంటింట సర్వే పక్కాగా చేపట్టి, తప్పులు లేని జాబి తా సిద్ధం చేయాలని విజయనగరం ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గజపతిన గరం, బొండపల్లి, గంట్యాడ, దత్తిరాజే రు, జామి మండలాల తహసీల్దార్‌లు, సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. బీఎల్‌ఓలు చేపడుతున్న ఇంటింట ఓటర్ల సర్వేకు బీఎల్ఏలు(బూత్ లెవెల్ ఏజెంట్లు), నాయకులు అంతా సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా లో పేర్లు, చిరునామా, ఫొటోలు సరిచూసుకోవాలని చెప్పారు. ఒకరి పేరు జాబితాలో రెండు సార్లు ఉన్నా, రెండు ప్రాంతాల్లో ఉన్నా, ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉండడం వంటి వాటిని గుర్తించాలని అన్నారు. మార్పులు, చేర్పులు, తొలగింపులు చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం గజపతినగరంలో చేపట్టిన ఇంటింట సర్వేను ఆమె పర్యవేక్షించారు. గజపతినగరం, బొండప ల్లి, గంట్యాడ, దత్తిరాజేరు, జామి తహసీల్దార్‌లు ఎం.అరుణకుమారి, ప్రసాద్, స్వర్ణకుమార్, గురుమూర్తి, హేమంత్‌కుమార్, ఎలక్షన్ డీటీ కె.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

21కి సర్వే పూర్తి చేయాలి

కొత్తవలస: ఇంటింట ఓటర్ల సర్వేను ఈనెల 21వ తేదీనాటికి పూర్తిచేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ టి.రమేష్ బీఎల్‌ఓలను ఆదేశించారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీ ల్లోని 67 పోలింగ్ బూత్‌ల పరిధిలో 21,935 ఇళ్లలో 56,697 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 6,448 ఇళ్లలో 16,669 మంది ఓటర్లకు సంబంధించిన సర్వే పూర్తయిందని, 21వ తేదీలోగా రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్ల సమక్షంలో సర్వే శతశాతం సర్వే పూర్తి చేయాలన్నారు. రీసర్వే డీటీ కోటప్పారావు తదతరులు పాల్గొన్నారు.

ఖచ్చితమైన ఓటర్ల జాబితానే లక్ష్యం

శృంగవరపుకోట: ఎన్నికల సంఘం ఆదేశాల అనుసారం ఖచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి తహసీల్దార్ నుంచి బీఎల్‌ఓల వరకు అంతా సమష్టిగా కృషి చేయాలని ఈఆర్‌ఓ, మండల ప్రత్యేక అధికారి బి.సుదర్శన్‌దొర సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, ఎస్.కోట, వేపాడ మండల తహసీల్దార్‌లు, ఎలక్షన్ డీటీలు, వీఆర్‌ఓలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇంటింట సర్వేలో అధికారులు అంతా పాల్గొని, ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



ఆశ కార్యకర్తలు,ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి గోపాలకృష్ణ

కొత్తవలస: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. వియ్యంపేట పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున డెంగీ, మలేరియా, టైఫాయిడ్, పచ్చ కామెర్లు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. రోజూ గ్రామాల్లో సర్వే నిర్వహించి జ్వరాలపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, 15 రోజులకొకసారి తాగునీటి ట్యాంకులు శుభ్రం చేసేలా చూడాలని సూచించారు. ఆరోగ్యసిబ్బంది జగదాంబ,నర్సింహారావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల(పీహెచ్‌సీ)లో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు ఎంపీపీ చల్లా చలంనాయుడు సూచించారు. మండలంలోని దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు గర్భిణులను ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయకుండా ఇక్కడే ప్రసవం చేసేలా చూడాలని చెప్పారు. నాడు-నేడు పథకంలో భాగంగా ఆస్పత్రికి అన్ని సౌకర్యాలను కల్పించామని, ఇక నుంచి 24 గంటల పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. పీహెచ్‌సీకి గతంలో ఒక్క వైద్యుడు కూడా ఉండే వారు కాదని, నేడు ఇద్దరు వైద్యులను నియమించామని చెప్పారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యాధికారులు ఝాన్సీ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఎల్‌ఐసీ ఉద్యోగులు

శృంగవరపుకోట: స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయంలో ఆలిండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్, ఎల్‌ఐసీ క్లాస్-3 ఆఫీసర్స్ అసోసియేషన్‌ల నేతృత్వంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఫ్యామిలీ పెన్షన్ పెంచాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఎన్‌పీఎస్ పెన్షన్ ఎంప్లాయిస్‌కు మేనేజిమెంట్ కంట్రిబ్యూషన్ 14శాతం పెంచాలని, కొత్త వేతన సవరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎల్‌ఐసీ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దత్తిరాజేరు: పిల్లలకు ఏడాది వరకు తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీ నుంచి మెయిన్ రోడ్డు వరకు ఆశ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.గర్భిణులు మంచి పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు.